రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు

8125972476

క్విక్ టుడే



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక




3

## సంయమనం పాటించాలి

ఇలాంటి ఘటనలను ఎవరూ ప్రోత్సహించకూడదు : అల్లు అరవింద్


EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 2 సంచిక : 103 | సోమవారం 23 డిసెంబర్ 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8


# ఆరోజు అసలు సినిమా ఇదే..

## సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటన పూర్తి వీడియో విడుదల చేసిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్






**హైదరాబాద్, డిసెంబర్ 22 (క్విక్ టుడే న్యూస్):** సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఆదివారం పూర్వాపరాలను మీడియాకు వివరించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద సంధ్య థియేటర్ పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా తొక్కిసలాట గురించి చర్చ జరిగిన విషయం తెలిసిందే.. అనంతరం హీరో అల్లు అర్జున్ కూడా మీడియా సమావేశం ఏర్పాటు చేసి తనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి, తొక్కిసలాటకు సంబంధించి పూర్తి వివరాలను వివరించారు. ఈ మేరకు పూర్తి వీడియో విడుదల చేశారు. ఈ ఘటనపై చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్ మాట్లాడారు. ఆరోజు జరిగిన విషయాన్ని మీడియాకు వివరించారు. తొక్కిసలాట జరిగిన తర్వాత అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్‌ను కలిసి తొక్కిసలాటలో మహిళ చనిపోయారు, బాలుడు తీవ్రంగా గాయపడ్డారు, పరిస్థితి అదుపు తప్పింది, థియేటర్ నుంచి వెళ్లిపోవాలని సూచించామని, అందుకు మేనేజర్ తమను అల్లు అర్జున్ వద్దకు వెళ్లనీయలేదని చెప్పారు. అయినా అతి కష్టం మీద వారిని నెట్టుకుంటూ వెళ్లి ఈ విషయం అల్లు అర్జున్‌కు చెప్పామని తెలిపారు. దీంతో ఆయన వెళ్లడానికి అధికారులంతా సహకరించి రూట్ క్లియర్ చేశారని వివరించారు. దయ చేసి ఇక్కడి నుంచి ఖాళీ చేయండి అన్ని చెప్పారని, సినిమా చూసిన తర్వాతే వెళ్తానని అల్లుఅర్జున్ అన్నారని ఏసీపీ తెలిపారు. దాంతో పరిస్థితిపై డీసీపీకి చెప్పినట్లు వివరించారు. ఆయనను కలవడానికి తాము లోనికి వెళ్లిన వీడియోలు ఉన్నాయని, అల్లుఅర్జున్‌తో మాట్లాడే ఫుటేజ్ కోసం ప్రయత్నించినా దొరకలేదని ఏసీపీ మీడియాకు వివరించారు. ఇక నుంచి ఊరుకునే ప్రసక్తే లేదు : సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ చెప్పారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆయన విడుదల చేశారు. ఇక నుంచి బౌన్సర్లు పోలీసులను ముట్టుకున్నా, మిస్ బిహేవ్ చేసినా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.



### సినీ నటుడు అల్లు అర్జున్

# ఇంటిపై దాడి

### పూలకుండీలు పగలగొట్టిన ఓయూ జేఏసీ

హైదరాబాద్, డిసెంబర్ 22 (క్విక్ టుడే న్యూస్): రేవతి మరణానికి కారణమంటూ సినీ నటుడు అల్లు అర్జున్ నివాసంపై ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ(ఓయూ జేఏసీ) దాడికి పాల్పడింది. సంధ్య థియేటర్ ఘటనలో నేపథ్యంలో అల్లు అర్జున్ నివాసం ముందు ఓయూ జేఏసీ విద్యార్థులు నిరసనకు దిగారు. అనంతరం ఆయన ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. ఇంట్లోకి వెళ్లిన నిరసనకారులు పూలకుండీలు పగలగొట్టారు. కాంపౌండ్ వాల్ ఎక్కి అల్లు అర్జున్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రేవతి కుటుంబానికి రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. హీరో అల్లు అర్జున్ ఇంటిపై దాడి నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీసులు బన్నీ ఇంటికి చేరుకొని ఘటన వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే ఈ దాడి అనంతరం అల్లు అర్జున్ తన పిల్లలను తన మామ ఇంటికి తరలించినట్టు సమాచారం. ఈ దాడి ఘటన నేపథ్యంలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు వెస్ట్ జోన్ డీసీపీ తెలిపారు. వారిపై చట్ట రీత్య చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఇలాంటి దాడులకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

### అల్లు అర్జున్ బేషరతుగా

# క్షమాపణ చెప్పాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్



**హైదరాబాద్, డిసెంబర్ 22 (క్విక్ టుడే న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సినీ నటుడు అల్లు అర్జున్ వెంటనే క్షమాపణ చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలపై ఎదురుదాడిగా తన ఇమేజ్ దెబ్బతీశారంటూ అర్జున్ మాట్లాడటం సరికాదన్నారు. నిన్న సాయంత్రం(శనివారం) జరిగిన ప్రెస్‌మీట్‌లో అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలపై కోమటి రెడ్డి స్పందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు లీగల్ టీమ్ ఒప్పుకోలేదనటం హాస్యాస్పదమన్నారు. అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తే ఇమేజ్ దెబ్బతిన్నదని అంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక నుంచి బెనిఫిట్ షోలు ఉండవని కోమటిరెడ్డి వెంకట్?రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు ఇదే అంశంపై పలువురు కాంగ్రెస్ నాయకులు కూడా స్పందించారు. ప్రజా ప్రభుత్వంలో ఎవరు తప్పు చేసినా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఎమ్మెల్సీ బలుమూరు వెంకట్ తెలిపారు. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి సామాన్యులను కష్టపెడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టమని ప్రజలకు ధైర్యం, భరోసా కల్పించే ప్రయత్నం చేస్తే స్వాగితించాల్సింది పోయి, వెంటనే సినీ నటుడు అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని బలుమూరు వెంకట్ ప్రశ్నించారు.



### ప్రధాని మోదీకి

# అత్యున్నత పురస్కారం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 22:** ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం కువైట్ అత్యున్నత గౌరవ పురస్కారం్షది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్‌ను అందుకున్నారు. విదేశాల అత్యున్నత నాయకులకు, రాజ కుటుంబాల సభ్యులకు స్నేహానికి గుర్తుగా ఈ పురస్కారాన్ని అందిస్తారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైట్ చేరుకున్న మోదీకి బేయన్ ప్యాలెస్‌లో సైనిక వందనం లభించింది. కువైట్ అమీర్(దేశాధినేత) షేక్ మెషల్ అల్–అహ్మద్ అల్–జబర్ అల్–సబహ్ స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు. గత 43 ఏండ్లలో భారత ప్రధాని కువైట్‌లో పర్యటించడం ఇదే ప్రథమం.

# వచ్చేనెల దావోస్‌కు సీఎం రేవంత్

### ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సుకు హాజరు

### భారత్ నుంచి చంద్రబాబు సహా ముగ్గురు సీఎంలు

### నారా లోకేశ్‌తోపాటు పలు రాష్ట్రాల మంత్రులూ హాజరు



న్యూఢిల్లీ, డిసెంబరు 22: దాదాపు 100 మందికిపైగా సీఈవోలు హాజరుకానున్న ప్రపంచ ఆర్థిక వేదిక(వరల్డ్ ఎకనమిక్ ఫోరం) వార్షిక సదస్సుకు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి సహా భారత్ నుంచి కనీసం ముగ్గురు సీఎంలు హాజరుకానున్నారు. జనవరి 20 నుంచి దావోస‌లో ఐదు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఏపీ మంత్రి నారా లోకేశ్, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, తమిళనాడు మంత్రి టీఆర్‌బీ రాజా, యూపీ మంత్రి సురేశ్ ఖన్నా తదితరులు పాల్గొననున్నారు. స్విస్ స్కై రిసార్ట్‌లో జరిగే ఈ సదస్సుకు పలువురు కేంద్ర మంత్రులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాద్షికొలాబరేషన్ ఫర్ ది ఇంటెలిజెంట్ ఏజ్ణ అనే ప్రధాన థీమ్‌తో సదస్సును నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50 మంది దేశాధినేతలు, ప్రభుత్వాల ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉంది. భారత్ నుంచి అదానీ, రిలయన్స్, టాటా, బిర్లా, భారతీ, మహీంద్రా, గోద్రెజ్, జిందాల్, బజాజ్, వేదాంత గ్రూపులు సహా పలు వాణిజ్య సమూహాల టాప్ ఎగ్జిక్యూటివ్‌లు, పౌర సమాజాల సభ్యులు కూడా హాజరుకానున్నారు.్షఇండియాస్ ఎకనమిక్ బ్లూప్రింట్ణ్ సహా పలు సెషన్లలో భారత ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది.

### చెస్‌లో ఏపీ సీఎం చంద్రబాబు మనవడు

# దేవాంశ్ వరల్డ్ రికార్డ్

**అమరావతి, డిసెంబర్ 22 (క్విక్ టుడే న్యూస్):**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, మంత్రి నారా లోకేశ్ తనయుడు దేవాంశ్ చదరంగంలో ప్రపంచ రికార్డ్ సృష్టించారు. వేగంగా పావులు కదపడంలో ఈ రికార్డును నెలకొల్పారు. 9 ఏళ్ల దేవాంశ్ వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్– 175 పజిల్స్ వరల్డ్? రికార్డును కైవసం చేసుకున్నారు. ప్రతిష్ఠాత్మక వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ నుంచి అధికారిక ధ్రువీకరణ పత్రాన్ని కూడా అందుకున్నారు. దేవాంశ్? సాధించిన ఈ ఘనత పట్ల నారా కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. దేవాంశ్ లేజర్ షార్ప్ ఫోకస్‌తో ట్రైనింగ్? పొందడం ప్రత్యక్షంగా చూశానని, ఈ ఘనత పట్ల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఃదేవాంశ్ ఈ క్రీడను(చదరంగం) ఎంతో ఇష్టంగా స్వీకరించాడు. గ్లోబల్ అరేనాలో భారత చదరంగ క్రీడాకారుల అద్భుతమైన, చారిత్రాత్మక ప్రదర్శనల నుంచి ప్రేరణ పొందాడు. ఈ ఈవెంట్ కోసం గత కొన్ని వారాలుగా రోజుకు 5–6 గంటలు పాటు శిక్షణ పొందాడు. చెస్ పాఠాలను నేర్పిన రాయ్ చెస్ అకాడమీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నాః అని లోకేశ్ తెలిపారు. దేవాంశ్ సృజనాత్మకంగా చెస్?ను నేర్చుకునే ఒక డైనమిక్ స్టూడెంట్? అని కోచ్ కె.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

### రైతు భరోసాపై

# నిలదీయండి

### అన్నదాతలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్, డిసెంబర్ 22 (క్విక్ టుడే న్యూస్):** అన్నదాతలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. వంచనను గ్రహించి ఆంక్షలు వద్దని ఆందోళన చేయాల్సిన వేళ ఇది అని తెలిపారు. ఇప్పుడు మేల్కోకపోతే భరోసా ఉండదు.. గోస మాత్రమే మిగులుతుందని చెప్పారు. జాగ్రత్తగా ఉండాలని.. రైతు భరోసా ఎగవేతల మోసాన్ని ఎదురించాలని సూచించారు. ఆంక్షలు.. కోతలతో సగం మందికి ఎగనామం పెట్టే ఎత్తులను చిత్తుచేయాలని సూచించారు. ప్రతి ఎకరాకు.. ప్రతి రైతుకు పెట్టుబడి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎత్తులను, నక్క జిత్తులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను గల్లా పట్టి నిలదీయాలన్నారు.

# రాహుల్ గాంధీకి సమన్లు

### జనవరి 7న యూపీలోని బరేలీ కోర్టులో హాజరుకు ఆదేశం



**బరేలీ(యూపీ), డిసెంబర్22:** లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆర్థిక సర్వేకు సంబంధించి వ్యాఖ్యలు చేసినందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి జనవరి 7న హాజరుకావాలని ఆదేశిస్తూ స్థానిక కోర్టు సమన్లు జారీచేసింది. జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి శనివారం రాహుల్ గాంధీకి సమన్లు జారీచేశారు. అఖిల భారత హిందూ మహాసంఘ్ మండల అధ్యక్షుడు పంకజ్ పాఠక్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ సమన్లు జారీ అయ్యాయి. రాహుల్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ ఆగస్టులో ఎమ్మెల్యే ఎంపీ కోర్టు/సీజేఎం కోర్టును పాఠక్ తొలుత ఆశ్రయించారు. అయితే ఈ దరఖాస్తును కోర్టు ఆగస్టు 27న తిరస్కరించడంతో ఆయన సెషన్స్ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేయగా ఇప్పుడు అదే కోర్టు రాహుల్‌కు సమన్లు జారీచేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచార సందర్భంగా రాహుల్ గాంధీ ఆర్థిక సర్వేను ప్రస్తావిస్తూ దేశంలో బలహీన వర్గాల శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ వారు సంపాదించుకున్న ఆస్తులు మాత్రం చాలా తక్కువని అన్నారని పాఠక్ తరఫున పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది వీరేంద్ర పాల్ గుప్తా అన్నారు. కులాల మధ్య విద్వేషాలను సృష్టించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలన్నది రాహుల్ ఆలోచనని ఆయన ఆరోపించారు.

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

సోమవారం 23 డిసెంబర్ 2024

quicktodaynews.com



# ఏ ఇంట్లోకైనా మీడియా చొచ్చుకు వెళ్లవచ్చా?

**హైదరాబాద్, డిసెంబర్ 22 (క్విక్ టుడే న్యూస్):** సినీ నటుడు మోహన్ బాబు ఫ్యామిలీ వ్యవహారంపై కొంత కాలంగా సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. సెలబ్రిటీలు, సామాన్యులు ఇలా ఎవరి ఇంట్లోకి అయినా అనుమతి లేకుండా మీడియా చొచ్చుకు వెళ్లవచ్చా అనేది ప్రశ్న. ఎవరిదైనా ప్రైవేటు స్థలం లేదా భవనంలోకి ఇతర వ్యక్తులు ప్రవేశించాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చట్టం చెబుతోంది. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 329 ప్రకారం, అనుమతి లేకుండా ఇతరుల భవనాలు, స్థలాల్లోకి చొరబడటం ట్రెస్ పాసింగ్ అనే నేరం కిందకు వస్తుంది. దానికి సందర్భం, కారణాలను బట్టి మూడు నెలలు, ఏడాది వరకు జైలు శిక్ష ఉందని చట్టం చెబుతోంది. ఈ విషయంలో జర్నలిస్టులకు ఎలాంటి మినహాయింపు లేదు. భారతదేశ చట్టాల ప్రకారం జర్నలిస్టులు, సామాన్య పౌరులు అంతా సమానమే. మీడియా వారైనా సరే, ఏ సామాన్యుడి ఇల్లు అయినా, సెలబ్రిటీ ఇల్లు అయినా వారి గోడ దాటి అనుమతి లేకుండా లోపలికి ప్రవేశిస్తే వారిపై ఆ భవన యజమాని కేసు పెట్టవచ్చు. బ్లిక్ పర్సనాలిటీల వ్యక్తిగత వ్యవహారంపై ప్రజలందరికీ ఉత్సాహం ఉంటుంది. అందుకే మీడియా దాన్ని రిపోర్ట్ చేయవలసి వస్తుంది. అదే సందర్భంలో మీడియాపై భౌతిక దాడి సరికాదు. తప్పు చేస్తే చట్టపరంగా వెళ్లాలి అనేది జర్నలిస్టుల వాదన. చొరబడటంలో కూడా చాలా రకాలున్నాయి. ఆయుధాలతో రావడం, రహస్యంగా రావడం, గోడ దూకడం, రాత్రి వేళ రావడం, గేట్లు పగలగొట్టడం.. ఇలా నేరాన్ని బట్టి కేసు తీరు మారుతుంది. ఒకవేళ వేరే వారు అక్కడ గేట్లు పగలగొట్టినా ఆ దారిలో మీడియా వాళ్లు వెళ్ళడం కూడా చట్ట ప్రకారం నేరమే. ఈ స్థలం ఫలానా వారిది ట్రెస్పాసర్స్ విల్ బి ప్రాసిక్యూటెడ్ అని సాధారణంగా కొన్ని ఖాళీ స్థలాల దగ్గర బోర్డులు పెడుతుంటారు. అనుమతి లేకుండా ప్రవేశించిన వారు శిక్షార్హులు అని దీనర్థం. నిబంధన ఇంటికి, ఇతర ప్రైవేటు స్థలాలకు కూడా వర్తిస్తుంది. మీడియా వారికి, సెలబ్రిటీలకు కూడా ఇందులో మినహాయింపు లేదు. కాకపోతే, అమెరికా వంటి దేశాల్లో ఇది అందరూ పాటిస్తారు. మనదేశంలో చట్టాలపై అవగాహన తక్కువ కాబట్టి, ఎక్కువ మంది దీన్ని గౌరవించరు. కానీ, ఎవరైనా గట్టిగా నిలబడి కేసు పెడితే, కచ్చితంగా చొరబాటు చేసిన వారికి శిక్ష పడుతుంది అంటున్నారు న్యాయనిపుణులు. అంతేకాదు, తమ స్థలం లేదా భవనంలోకి చొచ్చుకు వస్తున్న వారిని ఆపే హక్కు కూడా ఆ స్థల యజమానులకు ఉంటుంది. అయితే దాని అర్థం భౌతిక దాడులు చేయవచ్చని కాదు. వారిని ప్రవేశించకుండా ఆపవచ్చు అని మాత్రమే చట్టం చెబుతోంది. సాధారణంగా దొంగతనం కోసం, దాడులు చేయడం కోసం, ఆక్రమణ కోసం ఎవరైనా ప్రాపర్టీలోకి వస్తే ట్రెస్పాసింగ్ కేసులు పెడతారు. కానీ మాట్లాడటం కోసం, సమాచారం కోసం, లేదా అసలు ఏ ఉద్దేశం లేకుండా ఊరికే ఇతరుల స్థలంలోకి వెళ్లినా కేసు పెట్టవచ్చా అంటే అవుననే చెబుతోంది చట్టం. అంటే ఇక్కడ చొరబాటుదారుని లక్ష్యం ముఖ్యం కాదు. కాకపోతే ఉద్దేశాన్ని బట్టి శిక్ష తీవ్రత మారవచ్చు. కానీ, అసలు ఏ చెడు ఉద్దేశం లేకుండా వెళ్లినా నేరం నేరమే. ఎందుకంటే, రేపు ఎవరో ఒకరు నీ ఇంటి ముందుకు వచ్చి కూర్చుంటారు. నాకే ఉద్దేశమూ లేదు. ఊరికే మీ ఇంటి ముందు నుంచుంటా అంటే చెల్లదు కదా? బోర్డు పెట్టినా, పెట్టకపోయినా, ప్రతి ప్రైవేటు ఆస్తి మీద యజమానికి హక్కు సహజంగా ఉంటుంది. శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే జర్నలిస్టులపై 2020లో ఈ తరహా కేసు పెట్టించారు. తన నివాసంలోకి అక్రమంగా చొరబడ్డారు అంటూ రిపబ్లిక్ టీవీ రిపోర్టర్, కెమెరా పర్సన్, ఆ బండి నడిపిన డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. అలాగే 2018లో చెన్నైలోని ఒక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థను వీడియో తీస్తున్న ఇద్దరు ఫ్రెంచ్ జర్నలిస్టులపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. అంటే ఈ విషయంలో ఎవరికీ మినహాయింపులు లేవని స్పష్టమవుతోంది. చట్ట ప్రకారం పోలీసులు కూడా ప్రైవేటు ప్రాపర్టీలోకి వెళ్లడానికి స్పష్టమైన కారణం ఉండాలి. ఒకటి వారికి ఎవరైనా ఫిర్యాదు చేసి ఉండాలి లేదా, వారికి అక్కడ తీవ్రమైన నేరం, తక్షణం ఆపించాల్సిన నేరం జరుగుతోందన్న కచ్చితమైన సమాచారం వచ్చి ఉండాలి, లేదా కోర్టు లేదా ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాచారం వచ్చి ఉండాలి. అప్పుడే మాత్రమే పోలీసులు ప్రైవేటు ప్రాపర్టీలోనికి అడుగు పెట్టగలరు.

అయితే భారతదేశంలో చాలా వరకు ఈ చట్టం మీద అవగాహన లేకపోవడం, అవగాహన ఉన్న వారు కూడా పోలీసులతో అనవసర గొడవ ఎందుకు అనుకుని ఊరుకోవడం సహజంగా కనిపిస్తుంది. ఇక, చొరబడటం మాత్రమే కాదు ఒక వ్యక్తి వెంటపడటం, వెంబడించడం కూడా శిక్షార్హమైన నేరమే. తరచూ వెంటబడటం, ఎక్కడకు వెళ్లినా వెనకాలే వెళ్లడం వంటివి చట్ట ప్రకారం స్టాకింగ్ అనే నేరం కిందకు వస్తాయి. అయితే విస్తృతమైన ప్రజాప్రయోజనం ఇమిడి ఉన్న అంశాల్లో కొన్ని సార్లు మీడియా వెళ్లాల్సి రావచ్చు. అప్పుడు కూడా అది చట్ట వ్యతిరేకమే అయినప్పటికీ విస్తృతమైన ప్రజాప్రయోజనం ఉంది కాబట్టి దాన్ని వెలికితీయడానికి కాస్త రిస్క్ తీసుకోవడం అవసరం అనే వాదన చేయచ్చు. కానీ, అప్పుడు కూడా అది అంతగా ప్రజాప్రయోజనంతో ముడిపడింది అవ్వడం, అందులో కూడా వ్యక్తుల ప్రైవసీకి భంగకరం కాని రీతిలో వ్యవహరించడం లాంటి అంశాలు ముడిపడి ఉంటాయి. చీటికి మాటికీ ఎక్కడ పడితే అక్కడికి మైకులు తీసుకుని దూసుకువెళ్లే అధికారం సాధారణ ప్రజలకు ఎలా ఉండదో మీడియాకు కూడా ఉండదు. దాదాపు పదేళ్ళ క్రితం చిరంజీవి ఇంట్లో ఒక ప్రైవేటు కార్యక్రమం జరిగినప్పుడు ఒక ఇంగ్లీషు పత్రిక ఫోటోగ్రాఫర్ గోడదూకి



ఆ కార్యక్రమం లోపలికి వెళ్లారు. అప్పుడు అతనిపై పవన్ కళ్యాణ్ భౌతిక దాడి చేశారు. తరువాత ఫిలిం చాంబర్ లో సినిమా పెద్దలు ఆ ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. తాజాగా మోహన్ బాబు ఇంటిలోకి మీడియా వెళ్లింది. ఆయనా దాడి చేశారు. ఈ మధ్య ఒక తెలంగాణ నార్కొటిక్స్ అధికారిని ఇంటర్వ్యూ ఇవ్వమంటూ ఒక మహిళా జర్నలిస్టు మీదమీదకు వెళ్లిన ఘటన కూడా ఇటువంటిదే. చిరంజీవి ఘటన సమయంలోనూ ప్రైవసీ అనే అంశం చర్చకు వచ్చింది. మీడియా కూడా తనకున్న పరిమితులు తెలుసుకోవాలి. అందరి ప్రైవసీని మీడియా గౌరవించాల్సిందే. దాన్ని ఉల్లంఘించే హక్కు లేదు. మీడియా కూడా తన పరిమితులు తెలుసుకుని, అక్కడ ఏం జరుగుతోందో చెప్పవచ్చు. రిపోర్ట్ చేయవచ్చు. కానీ ఆవేశపూరిత పరిస్థితులు కుటుంబంలో ఉన్నప్పుడు మధ్యలోకి వెళ్లకూడదు. మీడియా ఆవేశంలో వెళ్లడం పొరబాటు అనిపిస్తుంది. కానీ దానికి ప్రతిగా భౌతిక దాడి చేయడం కూడా సరికాదు. కొందరు అవగాహన లేని మీడియా ప్రతినిధులు అత్యుత్సాహం చూపుతుంటారు. జర్నలిజంలో ఏబీసీడీలు, పాత్రికేయ విలువలు, ఏం చేయాలి, ఏం చేయకూడదు వంటివి తెలియని వారు మీడియాలోకి రావడం వల్ల కూడా సమస్య వస్తోంది. గత కొన్ని రోజులుగా సినీ నటుడు మోహన్ బాబు ఆయన కుమారుడు మనోజ్‌కు మధ్య వివాదం తలెత్తింది. జల్‌పల్లిలోని ఇంట్లోకి తనను రానివ్వలేదంటూ మంచు మనోజ్ మీడియా తీసుకుని ఆ ఇంటివద్దకు వెళ్లారు. అదే సమయంలో సెక్యూరిటీ మనోజ్ దంపతులను లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలోనే మనోజ్ గేటు బద్దలుకొట్టి ఇంట్లోకి వెళ్లారు. అక్కడే ఉన్న మోహన్‌బాబును ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. ఆయన ఆగ్రహాని గురయ్యారు. అతని మైక్‌తోనే మీడియా ప్రతినిధిని కొట్టారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే తనపై నమోదైన కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు మోహన్ బాబు. గురువారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఆయన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో ఎవరి తప్పు ఎంత ఉన్నదో...న్యాయస్థానం ఏం చెబుతుందో చూడాలి. హైకోర్టు తీర్పు కోసం తెలుగు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు!

## సంయమనం పాటించాలి

### ఇలాంటి ఘటనలను ఎవరూ ప్రోత్సహించకూడదు : అల్లు అరవింద్



**హైదరాబాద్, డిసెంబర్ 22 (క్విక్ టుడే న్యూస్):** సినీ నటుడు అల్లు అర్జున్ ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓయూ జేఏసీకి చెందిన పలువురు నాయకులు విధ్వంసం సృష్టించారు. ఇంటి ప్రహరీ గోడ దూకి.. ఇంటి లోపలికి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇంటి ఆవరణలో ఉన్న పూలకుండీలను ధ్వంసం చేశారు. రేవతి మృతికి కారణం అల్లు అర్జున్ అంటూ నినదించారు. ఆ తర్వాత సమాచారం అందుకున్న పోలీసులు సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని.. స్టేషన్‌కు తరలించారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో అల్లు అరవింద్ మీడియాతో మాట్లాడారు. మా ఇంటి ముందు జరిగిన ఘటన అందరూ చూశారన్నారు. తాము సంయమనం పాటించాల్సిన సమయమని.. అందుకే అదే పాటిస్తున్నామన్నారు. ఇంటికి జూబ్లీహిల్స్ పోలీసులు వచ్చారని.. దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఎవరైనా గొడవ చేయడానికి వస్తే పోలీసులు తీసుకెళ్లడానికి సిద్ధంగానే ఉన్నారని తెలిపారు. ఎవరూ ఇలాంటి దుశ్చర్యలను ప్రేరేపించకూడదని.. ఇలాంటి ఘటన ఎవరికీ జరుగకూడదన్నారు. తొందరపడి ఎలాంటి చర్యలకు దిగొద్దని.. దయచేసి అర్థం చేసుకోవాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

### పరీక్షలను వాయిదా పడాలని

## స్కూళ్లకు బాంబు బెదిరింపులు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 22:** ఢిల్లీలోని మూడు స్కూళ్లకు ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపులు సొంత విద్యార్థుల పనేనని పోలీసులు గుర్తించారు. నవంబర్ 28న రోహిణి ప్రశాంత్ విహార్ వద్ద పేలుడు సంభవించిన మరుసటి రోజే వెంకటేశ్వర్ గ్లోబల్ స్కూల్‌కు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. పరీక్షలను వాయిదా పడాలని కోరుకున్న ఇద్దరు తోబుట్టువులు గతంలో తమ బడికి వచ్చిన బాంబు బెదిరింపులను దృష్టిలో ఉంచుకొని బాంబు బెదిరింపు మెయిల్ పంపారు. రోహిణి, పశ్చిమ్ విహార్‌లోని మరో రెండు పాఠశాలల విద్యార్థులు కూడా స్కూళ్లు మూతపడాలనే కోరికతో నకిలీ బాంబు బెదిరింపుల ఈ-మెయిల్స్ పంపారు.

## ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా?

**హైదరాబాద్, డిసెంబర్ 22 (క్విక్ టుడే న్యూస్):** ఎన్నికలనేవి ప్రజాస్వామ్యంలో పండుగ వంటివి. పండగ ఖర్చును చూసి ఎవరూ భయపడరు. ఉన్నవాడు లేని వాడు అంతా తమకు ఉన్న దాంట్లో పండగ చేసుకుంటారు. అలాంటి ప్రజాస్వామ్య పండుగకు ప్రభుత్వం చేసే ఖర్చును బూచీగా చూపించి మోడీ సర్కార్ జమిలీ ఎన్నికలను ముందుకు తెచ్చింది. నిజానికి ఖర్చు మాట పైకి చెబున్నది. లోగుట్టు వేరే. ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా అనిపిస్తుంది సామాన్యుడికి సైతం. ఎన్నికల ఖర్చు ఆదా అంటే.. అది ఎన్నికల నిర్వహణ ఖర్చు ఆదానా లేక రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చులు తగ్గించుకునేందుకా! లోక్ సభ ఎన్నికలు ఒక సారి, అసెంబ్లీ ఎన్నికలు ఒక సారి వస్తే.. రెండు సార్లు నేతలు ఓటుకు నోటు ఇవ్వాలి, ప్రచారానికి భారీగా ఖర్చు పెట్టాలి, మందు ముక్క కు ఖర్చు పెట్టాలి.. అదే ఒకేసారి ఎన్నికలు వచ్చేస్తే ఖర్చులో ఖర్చు తగ్గిపోతుంది! అసెంబ్లీ ఎన్నికలకు, లోక్ సభ ఎన్నికలకు రెండు సార్లు నోటు ఇవ్వాల్సిన పని ఉండదు, ఇక ప్రచార ఖర్చు అయితే మరింతగా తగ్గిపోతుంది! బహుశా నేతలకు ఒకేసారి ఖర్చు చేసి ఐదేళ్ల పాటు ఇష్టానుసారం వ్యవహరించుకోవ డానికే ఈ జమిలి ఎన్నికల ఆలోచన కాబోలు! అయితే ఈ మాత్రం ఆలోచన, ఈ మాత్రం జ్ఞానం అమెరికా వంటి దేశానికి ఎందుకు లేదో మరి. అక్కడి ప్రతి నాలుగేళ్లకూ ఒకసారి ఎన్నికలు పెట్టుకున్నారు. శతాబ్దాల నుంచి అలాగే కొనసాగిస్తూ ఉన్నారు! మన దగ్గర ప్రధానికి అవకాశం ఐదేళ్లు, ముఖ్యమంత్రికి అవకాశం ఐదేళ్లు.. అన్ని ప్రజాస్వామ్య బద్ధ పదవులకూ ఐదేళ్ల కాలాన్ని ఇచ్చింది భారతరాజ్యాంగం. అమెరికాలో మరీ నాలుగేళ్లే అవకాశం. ఐదేళ్లతో పోలిస్తే నాలుగేళ్లు ఒక ఏడాది ముందుగానే



గడిచిపోతాయి. సర్దుకోవడానికి ఏడాది పడుతుంది, చివరి ఏడాది ఎన్నికల ఏడాది. మధ్యలో మిగిలింది రెండేళ్ల సమయమే.. అయితే ఏ అమెరికన్ ప్రెసిడెంట్ కూడా నాలుగేళు మరీ తక్కువ కాలం, దాన్ని ఐదేళ్లు చేయాలనో, ఆరేళ్లు చేయాలనో వాదించలేదు! అలా తమ పదవీ కాలాన్ని పెంచుకునే ప్రయత్నాలనూ చేయలేదు! ఎన్నికల ఖర్చు గురించి తెగ బాధపడిపోతూ ఇప్పుడు భారత ప్రభుత్వం ఒక దేశం ఒక ఎన్నికలు అంటూ వాదిస్తూ ఉంది. అయితే ఏదైనా 'ఒకే' అనేది భారత్‌కు వర్తింపచేయటం చాలా కష్టం. అసలు కుదరదు. ఎందుకంటే మనది భిన్నత్వం! భిన్నత్వంలో ఏకత్వమే భారత ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తూ వచ్చింది. అయితే మరీ ముఖ్యంగా 2014 నుంచి ఒకటే ఒకటే.. అనే మాట బాగా వినిపిస్తూ ఉంది. ఒకటే భాష, ఒకటే మతం, ఒకటే పౌరసత్వం, ఒకటే ఎన్నిక.. ఇలాంటి వాదనలు ముఖ్యమైన పదవుల్లోని వారి నుంచి వినిపిస్తూ ఉన్నాయి. ఒక్కక్కటిగా సాధించుకుంటూ ఉన్నారు! మరి ఇప్పుడు ఒకేసారి ఎన్నికలు జరిగిపోతే ఆ తర్వాత ఐదేళ్లు ఇక ఏం చేసినా అడిగే వారు ఉండరనా! మొన్నటి వరకూ మోడీజీకి చాలా కష్టం ఉండేది. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలంటే కర్ణాటక చుట్టూ నెల రోజుల పాటు తిరగాలి, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలంటే మహారాష్ట్ర కు తనే సీఎం అభ్యర్థిని అన్నట్టుగా ప్రచారం చేయాలి.. ఇలా దేశంలో ఎక్కడ అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా.. ప్రధానిగా కన్నా.. ఆ రాష్ట్రానికి తనే సీఎం క్యాండిడేట్ అన్నట్టుగా మోడీ ప్రచారం చేసి పెట్టే వాళ్లు! మరి ఈ ఇబ్బంది వద్దనే.. ఒక దేశంలో అన్ని రాష్ట్రాలకూ, అన్ని లోక్ సభస్థానాలకూ ఎన్నికలు జరిగేస్తే? ఆ తర్వాత మోడీ కి ఇలా ముఖ్యమంత్రి అభ్యర్థి తరహాలో ప్రచారం చేయాల్సిన అవసరం తప్పుతుంది! ఇక ఆయన ఎంచక్కా ప్రధానిగా తన పనుల్లో మునిగిపోవచ్చు. అలాగే యూపీ అసెంబ్లీ ఎన్నికలంటే పెట్రో ధరలను పెంచకుండా కొన్నాళ్లు ఓపిక పట్టే వారు, ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచి పోలింగ్ ముగిసే రోజు వరకూ ధరల హెచ్చులు ఉండేవి కావు. అలాగే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలున్నప్పుడు కొన్ని ప్రజాకర్షక పథకాలు ఉండేవి. ఇక వాటి అవసరం కూడా ఉండదు. ఎలాగూ దేశమంతా ఐదేళ్లకు ఒకసారి అన్ని ఎన్నికలూ అయిపోతాయి కాబట్టి? ఇక ఆ రెన్నాళ్లూ ప్రజాకర్షక పథకాలు అమలు చేస్తే చాలు, ఆ తర్వాత ఐదేళ్లూ ఆడింది ఆట, పాడింది పాట! కార్పొరేట్లకు వంత పాడుకోవచ్చు , సామాన్య ప్రజలు మరో ఐదేళ్ల వరకు సైలెంట్‌గా మూలనపడి ఉంటారు.

## శబరిమల మండల పూజకు ఏర్పాట్లు పూర్తి

### డిసెంబరు 26న సన్నిధానంలో ప్రత్యేక పూజ

### భారీగా భక్తులు వచ్చే అవకాశం!

**శబరిమల, డిసెంబర్ 20:** శబరిమల అయ్యప్ప మండల పూజకు సన్నాహాలు పూర్తైనట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏడీఎం అరుణ్ నాయర్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అయ్యప్ప దర్శనం కోసం వచ్చే భక్తులకు ఏర్పాట్లపై సమీక్షించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జీఎస్‌వో ఉమేశ్ గోయల్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ జీ విజయన్, శబరిమల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీ మురారి బాబు సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. మండల పూజ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. నవంబరు 16న ప్రారంభమైన మండల పూజ సీజన్, డిసెంబరు 26న సన్నిధానంలో జరిగే ప్రత్యేక పూజతో ముగియనుంది. ఈ క్రమంలో తొలుత అయ్యప్ప స్వామిని 'తంకా అంకి'తో అలంకరించిన తర్వాత, పవిత్రమైన బంగారు వస్త్రాన్ని ఉత్సవ ఊరేగింపుతో ఆలయానికి తీసుకొస్తారు. తర్వాత




మండల పూజ నిర్వహిస్తారు. తంకా అంగీ దీపారాధన, మండల పూజ సందర్భంగా డిసెంబర్ 22 నుంచి అయ్యప్ప దర్శనానికి భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విద్యాసంస్థలకు సెలవులు కావడం వల్ల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. భక్తులు ప్రశాంతంగా అయ్యప్పను దర్శించుకునేలా ఏర్పాట్లు చేశాలని ఏడీఎం అధికారులను ఆదేశించారు."రానున్న రోజుల్లో శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. మండల పూజలు, తంకా అంగీ ఊరేగింపు సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ శాఖల ప్రతినిధులు బాగా పనిచేయాలి. చాలా అప్రమత్తంగా ఉండాలి. మండల పూజ, మకరవిళక్కు సమయంలో రద్దీని తగ్గించడానికి నిష్క్రమణ మార్గాలు అన్ని సమయాల్లో తెరిచి ఉంచాలి. అదనపు భద్రత కోసం సన్నిధానం వద్ద ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని మోహరించాలి. సన్నిధానం వద్ద మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నిషేధించాలి. ఈ నిబంధన అమల్లో ఉన్నా చాలా మంది ఉల్లంఘిస్తున్నారు. అందుకే పలు భాషల్లో ఎలక్ట్రానిక్ డిస్?ప్లేలు పెట్టాలి. రద్దీని దృష్టిలో ఉంచుకుని హొటళ్లలో గ్యాస్ సిలిండర్లను నిల్వ చేయకుండా నిరోధించాలి. అగ్నిమాపక దళం అన్ని సంస్థలకు హెచ్చరికలు జారీ చేస్తుంది" అని సన్నిధానం స్పెషల్ పోలీస్ అధికారి బీ కృష్ణకుమార్ తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు పొగాకు ఉత్పత్తులను ఉపయోగించకుండా ఉండేలా కఠినమైన తనిఖీలు కొనసాగుతాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. బుధవారం

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే QUICK TODAY

సోమవారం 23 డిసెంబర్ 2024 quicktodaynews.com



# గుట్టను కొట్టి.. గుడిసెలు వేసి..



## దర్జాగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు

### బోడుప్పల్‌లోని దేవేందర్‌నగర్ కాలనీలో భూ కబ్జాలు

### తహసీల్దార్, కమిషనర్ల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు

**మేడిపల్లి, డిసెంబర్ 22 (క్విక్ టుడే న్యూస్):** ప్రభుత్వ భూములను కాపాడాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేస్తుండగా మరోవైపు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతూనే ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీ సర్వే నెంబర్ 63/1 లో





వాటర్ ట్యాంక్ పక్కన ఉన్న దాదాపు 1000 చదరపు గజాల గుట్టను కొల్లగొట్టి ప్లాట్లుగా మార్చి గుడిసెలు వేశారు. కొంతమంది నాయకులు సిండికేట్‌గా ఏర్పడి ఇక్కడి ప్రభుత్వ భూములను ఆక్రమించి అమాయక ప్రజలకు అమ్మివేస్తున్నారు. ఈ భూములు కొన్నవారు మొదటగా ఇక్కడ గుడెసెలు వేస్తున్నారు. అనంతరం కొద్ది రోజుల్లో రాత్రికి రాత్రి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ల కనుసన్నల్లోనే రాత్రికి రాత్రే ఇక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. అందినకాడికి దండుకుని అడ్డదారుల్లో నిర్మాణాలు చేపట్టుకునేందుకు సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కబ్జాలకు పాల్పడేందుకే కొందరు నాయకులు పార్టీ మారారని సమాచారం వినిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ భూములను కాపాడాలనే చేపడుతున్న ప్రయత్నాలు భూకబ్జాదారుల కారణంగా నిర్వీర్యమవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే

# కఠిన చర్యలు తప్పవు

### బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

### భూకబ్జాలపై మేయర్ కు ఫిర్యాదు చేసిన దేవేందర్ నగర్ కాలనీ కమిటీ



**మేడిపల్లి, (క్విక్ టుడే న్యూస్):** ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ హెచ్చరించారు. దేవేందర్ నగర్ కాలనీలోని సర్వే నెంబర్ 63/1 ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా వేయడంపై దేవేందర్ నగర్ కాలనీ కమిటీ సభ్యులు మేయర్ తోటకూర అజయ్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మేయర్ స్పందించి మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో రోజురోజుకు అక్రమ కట్టడాలు మితిమీరిపోతున్నాయన్నారు. కొంతమంది స్వార్ధపరుల కారణంగా రోజు రోజుకు కుంచించుకు పోతుందని ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజావసరాలకు కోసం బస్తి దావకాన,కమిటి హాల్, పిల్లల ఆట స్థలంకు భూమి లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అప్పనంగా దోచుకొని అమాయక ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకున్న నాయకులు, ప్రభుత్వం మారడంతో వారు చేసిన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు కబ్జాలు కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తీర్థం పూచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దళారుల మాటలు నమ్మి ప్రభుత్వ భూమిలో ఏలాంటి కొనుగోళ్ళు చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దానగళ్ళ యాదగిరి, దేవేందర్ నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి మరాటి మల్లేష్, ఉపాధ్యక్షుడు బోడగళ్ళ సదానంద్, జెన్నె రాజు, బెల్లపురి మధు, మరాటి మత్స్యగిరి, వాసురి యాదగిరి,కట్టం స్వామి తదితరులు పాల్గొన్నారు.

---

## పాక్ కంటే బంగ్లాలోనే

# హిందువులపై ఎక్కువ హింస




బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో హిందువులు, మైనారిటీ వర్గాలపై ఇటీవల దాడులు పెరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా షేక్ హసీనా ప్రభుత్వం పతనం తర్వాత వీటి సంఖ్య భారీగా చోటు చేసుకుంటున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక ఘటనలకు సంబంధించి ఈ ఒక్క ఏడాదిలోనే 2200 కేసులు నమోదైనట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొంది. పాకిస్థాన్ లోనూ ఈ ఏడాది 112 కేసులు రికార్డయ్యాయని రాజ్యసభకు సమాచారం ఇచ్చింది. 'హింసాత్మక ఘటనలను భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. వీటిపై మన ఆందోళనను బంగ్లా ప్రభుత్వానికి వ్యక్తం చేశాం. హిందువులు, ఇతర మైనారిటీలకు భద్రత కల్పించేందుకు బంగ్లాదేశ్ అవసరమైన చర్యలన్నీ తీసుకుంటుందని ఆశిస్తున్నాం' అని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. దౌత్యమార్గాల ద్వారా ఆయా ప్రభుత్వాలతో తమ ఆందోళన తెలియజేశామని.. ఇటీవల బంగ్లాలో పర్యటించిన విదేశాంగ కార్యదర్శి కూడా ఇదే విషయాన్ని ఉద్ఘాటించారని పేర్కొంది. అటు మతపరమైన హింస, మైనారిటీ వర్గాలపై దాడులకు సంబంధించి చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్‌కు కూడా విజ్ఞప్తి చేసినట్లు భారత విదేశాంగ వెల్లడించింది. అక్కడి మైనారిటీలపై జరుగుతున్న దారుణాల గురించి అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ తీరును ఎండగడుతూనే ఉన్నామని తెలిపింది. విదేశాంగ నివేదిక ప్రకారం.. హిందువులపై హింసాత్మక ఘటనలకు సంబంధించి బంగ్లాదేశ్‌లో 2022లో 47, 2023లో 302కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ 8నాటికి ఏకంగా 2200 కేసులు రికార్డయ్యాయి. పాకిస్థాన్‌లో 2022లో 241 కేసులు, 2023లో 103, 2024లో 112 ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ రెండు దేశాలు మినహా మరే పొరుగు దేశంలో హిందువులపై హింసాత్మక దాడులు నమోదు కాలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు భారత్‌లోని కొన్ని ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలంటూ బంగ్లాదేశ్‌లో కొందరు చేస్తున్న వాదనను భారత్ తీవ్రంగా ఖండించింది. బహిరంగ వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. బంగ్లా వైపు నుంచి ఈ తరహా చర్యలు నిరాశ కలిగిస్తున్నాయని విదేశాంగశాఖ పేర్కొంది.

# టెక్నాలజీ బంధాలను దూరం చేస్తోందా?



టెక్నాలజీ బంధాలను బలోపేతం చేస్తోందా, మనుషులను దూరం చేస్తోందా అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. ఆధునిక టెక్నాలజీ ప్రపంచాన్ని అరచేతిలో పెట్టేస్తోంది. కానీ, మన చిన్న ప్రపంచాన్ని మాత్రం కొన్ని మైళ్ల దూరానికి తీసుకుపోతోంది. మునపటి తరానికి ప్రస్తుత తరానికి ఆలోచనలు, ఆచరణలో చాలా తేడా వుంది. దీనికి ప్రధాన కారణం టెక్నాలజీ అని చెప్పవచ్చు. తరానికి తరానికి మధ్య ఈ తేడా ఉండటం సహజమే కానీ. కానీ ఈ సహస్రాబ్ది జనరేషన్ స్పీడ్ మామూలుగా లేదు. పాతిక, ముప్పయ్ ఏళ్ల క్రితం మొబైల్ ఫోన్లు లేవు, స్కూలు, కాలేజీ నుంచి ఇంటికి వచ్చి అమ్మా నాన్నలతోనే గడిపేవారు. ఇప్పటిలా ఇంట్లో వేర్వేరు గదులు లేవు. హాల్‌లోనే చదువులు ఉండేవి. పిల్లలు రహస్యంగా ఏ పని చేయాలన్నా కష్టంగానే ఉండేది. తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దవాళ్లు ఓ కంట కనిపెట్టేవారు. పిల్లలు తల్లిదండ్రుల మాటకు చాలా విలువ ఇచ్చేవాళ్లు. కానీ ఇప్పుడు, 13, 14 ఏళ్లకే పిల్లల చేతికి మొబైల్ ఫోన్ వస్తోంది. స్కూలులో పాఠాలు నేర్చుకోవడానికి, రీసెర్చ్‌కి మొబైల్ ఫోన్ లేకపోతే ఎలా అని అడగడంతో, తోటి పిల్లల దగ్గర ఎక్కడ తక్కువైపోతారో, చదువులో ఎక్కడ వెనకబడిపోతారో అనే భయంతో తల్లిదండ్రులు పిల్లల చేతిలో స్మార్ట్ ఫోన్ పెట్టక తప్పట్లేదు. మొబైల్ చేతిలోకొచ్చాక వాళ్ల స్నేహాలు ఎవరితో ఎలా ఉంటున్నాయో అంచనా వేయలేరు. సైబర్ నేరాలు, సైబర్ మోసాలు, ఆడపిల్లలను మోసం చేయడం, అపరిచితులతో స్నేహాలు, డేటింగ్ ఇవన్నీ మొబైల్ ఫోన్ల వల్ల పెరుగుతున్నాయి. టెక్నాలజీ చేతుల్లోకి రాగానే, ప్రపంచం చేతుల్లోకి వచ్చేసింది. గత తరంలో పిల్లలు తమకు తెలియని విషయాల గురించి పెద్దవాళ్లను ప్రశ్నలు అడిగేవారు. ఇప్పుడు గూగుల్ తల్లిని అడుగుతున్నారు. ఫోన్లు, టీవీలు పిల్లలకు ఫ్రెండ్స్‌గా మారిపోయాయి. ఇంటికి చుట్టాలు, స్నేహితులు వస్తే, వాళ్లతో గడపడానికి, కనీసం ఐదు నిమిషాలు పలకరించేందుకు కూడా ఈ తరం పిల్లలకు ఓపిక ఉండటం లేదు. అవతలి వ్యక్తులు మాట్లాడుతుంటే, వీళ్లు ఫోన్లు చూసుకుంటూ, ఇంటికొచ్చిన వారి పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇది పేరెంట్స్ పెంపకం తప్పో, టెక్నాలజీ తప్పో అర్థం కాని పరిస్థితి. ఇక, ఇంట్లో అందరూ కలిసి భోజనం చేసే సంస్కృతి ఎప్పుడో పోయింది. దీంతో, కుటుంబ సభ్యుల మధ్య మాటలే కరువయ్యాయి. డబ్బులు కావాలంటే మాత్రం ప్రేమగా ఓ ఐదు నిమిషాలు మాట్లాడతారు. ప్రతి బంధాన్నీ ఓ డీల్‌లా చూడటం అలవాటైపోయింది. మానవ సంబంధాలు యాంత్రికంగా మారిపోయాయి. అసాధారణ ప్రవర్తనను ఈ జనరేషన్ సాధారణం చేశారు. ఐతే, ఈ తరం వారు దీర్ఘ కాలంలో ఒత్తిడికి, అసహనానికి లోనయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

క్షణకాలపు ఆకర్షణలో ఏర్పడే పరిచయాలకు శాశ్వతత్వం ఉండదు. ఆన్‌లైన్ చాట్‌లు, కొన్ని రోజులు గడిపిన తర్వాత గొడవలు సాధారణం అయ్యాయి. సైబర్ సైకాలజీ, బిహేవియర్ అండ్ సోషల్ నెట్ వర్కింగ్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో ఆన్‌లైన్‌లో కలిసిన జంటల సంబంధాలు ఆఫ్‌లైన్‌లో కలిసిన వారి కంటే భిన్నంగా ఎలా ఉంటాయనే అంశాలను పరిశీలించింది. ఈ అధ్యయనంలో ఆన్‌లైన్ డేటింగ్‌లో ఏర్పడే సంబంధాలు విఫలమవుతాయని, బలహీనంగా ఉంటాయని చెప్పడం తప్పు అని అధ్యయనకారులు పేర్కొన్నారు. నేటి యువత సంబంధాలను ఏర్పరచుకోవడంలో, నిర్వహించడంలో టెక్నాలజీ కీలకమైన మార్పులు తీసుకువచ్చింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ లాంటి సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫారాలు వాట్సాప్, సిగ్నల్ లాంటి మెసేజింగ్ అప్లికేషన్లు తక్షణ కనెక్టివిటీని అందిస్తున్నాయి. దూరంతో సంబంధం లేకుండా సులువుగా కమ్యూనికేట్ చేయడానికి, కొత్త స్నేహాలను ఏర్పరచుకోవడానికి సహాయపడుతున్నాయి. మరోవైపు ఈ కనెక్టివిటీని అధికంగా ఉపయోగించడం నిజమైన బంధాలకు ఆటంకంగా మారవచ్చు. ఒంటరితనం, అసంతృప్తికి కారణం కావచ్చు. మితిమీరిన స్క్రీన్ టైం వంటి అంశాలు ముఖాముఖి సంబంధాలను తగ్గిస్తాయి. దీనివల్ల సోషల్ స్కిల్స్, ఎమోషనల్ స్కిల్స్ మందగించవచ్చు. కాబట్టి, టెక్నాలజీని బ్యాలెన్స్‌గా వాడుకోవాలని యువత గుర్తించాలని అంటున్నారు సైకాలజిస్టులు.